క్లుప్తంగా

ఆర్థిక సహాయం

దోమ: మండల పరిధి బొంపల్లిలో గ్రామానికి చెందిన కుర్వ రామయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలతో అంత్యక్రియల నిమిత్తం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఇందులో ఎంపీటీసీ రాములు, ఉపసర్పంచ్ రఫిక్‌పాష, నేతలు అంతిరెడ్డి, రాములు, భాస్కర్, షఫి, వెంకటయ్య, హైమద్, కలీం ఉన్నారు.

ఘనంగా నృసింహుడి వార్షికోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

పరిగి: లక్ష్మీనరసింహస్వామి ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం పట్టణ కేంద్రంలో ఘనంగా జరిగింది. రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం స్వామి వారిని లక్ష్మీసమేతంగా పుర వీధుల గుండా పల్లకీలో ఊరేగించారు.

చికెన్ కొట్టు.. ఓటు పట్టు



చికెన్ కొడుతున్న గోపాల్ నాయక్

కుల్కచర్ల: ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఓటర్ల ప్రసన్నం కోసం అనేక పాట్లు పడుతున్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్.. ఆదివారం మండల కేంద్రంలోని ఓ చికెన్ దుకాణంలో చికెన్ కొట్టి, కొనుగోలు దారులకు అందజేస్తూ ఓటు వేయాలని అభ్యర్థించారు.

కాంగ్రెస్‌లో చేరిన రజక సంఘం నాయకులు



పార్టీలో చేరిన వారితో శ్రీనివాస్‌రెడ్డి

యాలాల: రజక సంఘం ముద్దాయిపేట నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆ పార్టీ నేత బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మనోహర్‌రెడ్డి గెలుపు తథ్యమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. పార్టీ ప్రకటించిన పథకాలకు ఆకర్షితులై ఇంత మంది రజక సంఘం నాయకులు, యువకులు పార్టీలోకి చేరడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ ఎంపీటీసీ దేవగారి రాములు, నాయకులు వాసిద్ ఖాన్, నర్సింహులు ముదిరాజ్, ఆరిఫ్ హుస్సేన్, బస్వరాజ్, రాజు చారి పాల్గొన్నారు.

తండ్రి బీఫాం అందుకున్న తనయుడు



బీఫాంను అందుకుంటున్న టీఆర్‌ఆర్ తనయుడు రితిక్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్ పార్టీ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి బీఫాంను ఆయన తనయుడు రితిక్‌రెడ్డి అందుకున్నారు. ఎన్నికల ప్రచారంలో టీఆర్‌ఆర్ బిజీగా ఉండటంతో ఆదివారం గాంధీ భవన్‌లో ఆయన తనయుడికి ఏఐసీసీ కార్యదర్శి విష్ణునాథ్ బీ ఫాం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని విష్ణునాథ్ సూచించగా.. భారీ మెజార్టీతో గెలిపిస్తామని రితిక్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు.

11న చలో హైదరాబాద్

యాలాల: ఈ నెల 11న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రచార కార్యదర్శి డప్పు నర్సింహులు కోరారు. ఈ మేరకు ఆదివారం మండల పరిధి నాగసముందర్ గ్రామంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఇందులో నాయకులు వెంకటప్ప, లక్ష్మప్ప, నరేష్, రాజు, యాదప్ప, అంబు, వెంకట్, లాలప్ప, మొగులప్ప ఉన్నారు.



మోమిన్‌పేట: మహిళతో మాట్లాడుతున్న నాయకులు



దోమ: పార్టీలో చేరిన బీఆర్‌ఎస్ కార్యకర్తలకు కాంగ్రెస్ కండువాలు కప్పుతున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



బంట్వారం: సల్బత్తాపూర్‌లో ప్రచారం చేస్తున్న స్వరూప

గులాబీ శ్రేణుల అసత్య ప్రచారం

- కర్ణాటకలో అమలవుతున్న గ్యారంటీ స్కీంలు
- సాగుకు సరఫరా అవుతున్న ఏడు గంటల ఉచిత విద్యుత్
- ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళలు
- తెలంగాణలో ప్రజాదరణ చూసి బెంబేలెత్తుతున్న బీఆర్‌ఎస్
- రాష్ట్రంలో అధికారం మాదే: కాంగ్రెస్ నాయకులు



ధారూరు: ధర్మాపూర్‌లో ప్రసాద్‌కుమార్ ప్రచార ర్యాలీ

మోమిన్‌పేట: కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఐదు గ్యారంటీలను అమలు చేయడం లేదని బీఆర్‌ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని హస్తం శ్రేణులు మండిపడ్డారు. ఎన్నికల నేపథ్యంలో ఆదివారం పార్టీ మోమిన్‌పేట మండల నాయకుడు సిరాజొద్దీన్ ఇతర నేతలతో కలిసి సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం కుంచారం దాని పరిసర గ్రామాల్లో పర్యటించారు. అనంతరం మాట్లాడారు. రైతులకు ఏడు గంటల విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేస్తుంటే, ఐదు గంటలే ఇస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అక్కడి రైతులకు బీఆర్‌ఎస్ నేతలు డబ్బులు ఇచ్చి తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నెలకు రూ.2వేలు ఇస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పార్టీ ఇచ్చిన ఐదు గ్యారంటీలను ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమలు చేస్తున్నారని, ఇది అక్కడి ప్రజలు తెలిపినట్లు ఆయన వివరించారు. తెలంగాణలో ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ పార్టీ జోరు కొనసాగుతుండటంతో భయానికి లోనైన బీఆర్‌ఎస్ నాయకులు, హస్తంపై బురద చల్లుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆశాభావం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారం మానుకోవాలని గులాబీ శ్రేణులకు సూచించారు. పార్టీ మండల సినియర్ నాయకులు మాణయ్య, ఎజాస్ పటేల్, మహేందర్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ సమక్షంలో పలువురి చేరిక

దౌల్తాబాద్: మండల పరిధి కుదురుముళ్ల, ఎల్‌జీ తండా, దేవర్‌ఫసల్‌వాద్ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు సుమారు 100మంది హైదరాబాద్‌లోని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి రేవంత్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఇందులో సర్పంచ్ అనిత, మాజీ ఎంపీటీసీ వెంకట్రాములు, లాలు, నర్సింహులు, శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

బీఆర్‌ఎస్‌ను నమ్మి మోసపోవద్దు

బంట్వారం: కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రసాద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మహిళా విభాగం బంట్వారం మండల అధ్యక్షురాలు అల్లాపురం స్వరూప కోరారు. ఆమె సల్బత్తాపూర్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. ప్రజలకు గ్యారంటీ పథకాల గురించి వివరించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ. ఐదు వందలకే వంట గ్యాస్, రైతులకు ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ అమలవుతుందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ను నమ్మి మరోసారి మోసపోద్దని, చేతి గుర్తుకు ఓటేసి ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాలని ఆమె అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ యూత్ వింగ్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గిరిదాస్, నాయకులు అనంతయ్య పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. కోట్‌పల్లి మండలం ఎన్కెపల్లి సర్పంచ్ భారతిరెడ్డి దంపతులు ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరితో పాటు వార్డు సభ్యురాలు సావిత్రమ్మ, మరి కొందరు గ్రామస్తులు ఉన్నారు. అదే విధంగా నాగసాన్‌పల్లికి చెందిన యువకులు పెద్ద సంఖ్యలో హస్తం గూటికి చేరారు.

ఇందిరమ్మ రాజ్యంతోనే న్యాయం

కుల్కచర్ల: ఇందిరమ్మ రాజ్యంతోనే పేదలకు న్యాయం జరుగుతుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా బండ వెల్కిచర్ల గ్రామంలో వారు ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. పేదల అభ్యున్నతికి పాల్పడేది కాంగ్రెస్సేనని, చేతి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ బ్లాక్‌టు అధ్యక్షుడు భరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, నాయకులు కుమ్మరి స్వామి, వెంకటేశ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపునకు పాల్పడిన ఎమ్మెల్యే..



పార్టీ కండువా కప్పుతున్న మాజీమంత్రి

ధారూరు: ఎమ్మెల్యే ఆనంద్ కక్ష సాధింపునకు పాల్పడ్డారని, అందుకే బీఆర్‌ఎస్‌ను వీడామని మున్నూరుసోమారం సర్పంచ్ అనూష, ఉద్యమ నాయకుడు రాంరెడ్డి అన్నారు. వీరిరువురు కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరగా.. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీసీరోడ్ల కోసం ఎంపీ నిధులు వస్తే.. వాటిని రద్దు చేయించారని ఆరోపించారు. దళితబంధు, బీసీబంధు పథకాలను తమను సంప్రదించకుండానే లబ్ధిదారులను ఎంపిక చేశారని, చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.లక్షల బిల్లులను అడ్డుకున్నారని ఆరోపించారు. మాజీమంత్రి మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని, వీరికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇందులో జాతీయ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు విజయ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ రవీందర్ ఉన్నారు.

పెద్దోళ్లను కుబేరులను చేసిన పీఎం, సీఎం

ధారూరు: దేశంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ ఈ పదేళ్ల కాలంలో పేదోళ్లను పేదోళ్లగానే ఉంచి, పెద్దోళ్లను అపర కుబేరులను చేశారని కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ నాయకులతో కలిసి ధారూరు మండలం గడ్డమీది గంగారం, నర్సాపూర్, కొండాపూర్‌కలాన్, ధర్మాపూర్, మున్నూరుసోమారం, క్యాచారం, స్టేషన్‌ధారూరు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పదేళ్ల క్రితం కుటుంబం ఖర్చు రూ.2 వేలు ఉంటే, నేడు అది రూ.10 వేలకు పెరిగిందన్నారు. రాబడి మాత్రం అంతంతగానే ఉందని పేర్కొన్నారు. దీంతో సామాన్య కుటుంబాల పరిస్థితి ఏమీ బాగాలేదని భావించిన సోనియాగాంధీ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఐదేళ్ల పాటు ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసి, పేదలకు ప్రయోజనం చేయనుందని చెప్పారు. కాంగ్రెస్ వస్తే అందరికీ మేలని, చేతి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని అభ్యర్థించారు. ప్రచారంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి, జాతీయ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, వాలీబాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మున్నూరుసోమారం సర్పంచ్ అనూష, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాల్లో వసతులు నిల్



రేగడిమైలారం పల్లె దవాఖాన

- వైద్యులకు కుర్చీలు లేవు.. రోగులకు బెంచీలు కరువు
- వసతుల లేమితో ఇబ్బంది పడుతున్న సిబ్బంది

బొంరాస్‌పేట: పేదలకు స్థానికంగా వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో మండల ఆరోగ్య కేంద్రాల పరిధిలో హెల్త్ సబ్‌సెంటర్ల (పల్లె దవాఖానలు)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ ఆ ఆసుపత్రులు వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. దుద్యాల, బొంరాస్‌పేట రెండు మండలాల పరిధిలో 10 హెల్త్ సబ్‌సెంటర్లు ఉండగా.. వీటిలో వైద్యులకు కుర్చీలు, రోగులకు బెంచీలు లేవు. మందులు నిల్వ ఉంచేందుకు ర్యాక్‌లు లేవని అక్కడి సిబ్బంది చెప్పారు.

అద్దె భవనాల్లో..

మండల పరిధి తుంకిమెట్ల ఉప ఆరోగ్య కేంద్రానికి సొంత భవనం ఉంది. రేగడిమైలారం, చౌదర్‌పల్లి, పల్లె దవాఖానలకు రూ.32లక్షలు వెచ్చించి.. నిర్మించిన భవనాలను ఇటీవల ప్రారంభించారు. దుద్యాల మండలం చిల్మల్‌మైలారం, గౌరారం, దుద్యాల ఆరోగ్య కేంద్రాల నూతన భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. మిగిలిన ఉప కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. నూతన హాస్పిటల్లో మెడికల్ అధికారి, స్టోర్ రూమ్, ఎంపీహెచ్‌ఏ (మహిళ), పేషంట్ వార్డుతో పాటు మరుగుదొడ్లను నిర్మించారు. అయితే అందులో సామగ్రి కొరవడడంతో అందిరికీ ఇబ్బందిగా మారింది. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పల్లె దవాఖానాల్లో తగిన సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నా రు. ఇదే విషయమై మండల వైద్యాధికారి హేమంత్ వివరాలు అడగగా.. ఎన్నికల అనంతరం సౌకర్యాల కల్పనకు చర్యలు చేపడతామని వెల్లడించారు.

ఎమ్మెల్యేది కుటుంబ పాలన

- చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కేఎస్ రత్నం

శంకర్‌పల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని ఆ పార్టీ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ రత్నం కోరారు. ఆదివారం శంకర్‌పల్లిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం పట్టణ కేంద్రంలో ర్యాలీగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని, నగరానికి సమీపాన ఉన్నా, వెనుకబాటుకు గురైందన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్, నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య కుటుంబ పాలన చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, సురేశ్, ఐలయ్య, బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై వ్యతిరేకత..

మొయినాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ రత్నం అన్నారు. మండల పరిధి నాగిరెడ్డిగూడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రత్నం సమక్షంలో మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. చేవెళ్లలో బీజేపీని గెలిపించేందుకు ప్రజలు ఉత్సాహం చూపుతున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపాలంటే బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కమలం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీలో చేరిన వారిలో యువకులు సురేష్, నరేందర్, పోచయ్య, చక్రవర్తి, గండయ్య, నారాయణ, దర్శన్, నర్సింహ్మా ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాశ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా నియోజకవర్గం కన్వీనర్ వెంకటేశ్ గౌడ్, నాయకులు జ్ఞానేశ్వర్, గరుగు రాజు, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు ఉన్నారు.



శంకర్‌పల్లిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ రత్నం

మరోసారి అధికారం మాదే..



బంట్వారం: ప్రచార రథంపై ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్



మర్పల్లి: ప్రచారం చేస్తున్న డీసీసీబీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌గుప్తా తదితరులు

- బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి
- నాడు ఏమీ చేయని వారికి మరోసారి అవకాశం ఎందుకివ్వాలి?
- ఇంటింటి ప్రచారంలో గులాబీ శ్రేణులు

బంట్వారం: అరవై ఏళ్లలో జరగని అభివృద్ధి, ప్రత్యేక తెలంగాణలో అదీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగిందని బీఆర్‌ఎస్ వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన బంట్వారం మండలం సుల్తాన్‌పూర్, నూరుల్లాపూర్, యాచారం, మాలసోమారం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని, మరోసారి అధికారం మనదేనని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు మాయమాటలతో మరోసారి మోసం చేసేందుకు మీ ముందుకు వస్తున్నాయని విమర్శించారు. ఆరు దశాబ్దాలు అవకాశమిస్తే ఏమీ చేయని వారికి, మరోసారి అవకాశం ఎందుకు ఇవ్వాలి అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే అది బీఆర్‌ఎస్‌కే సాధ్యమవుతుందని, కారు గుర్తుకు ఓటే సి తమను ఆదరించాలని ఆయన అభ్యర్థించారు.

రోహిత్‌రెడ్డితోనే అభివృద్ధి

యాలాల: తాండూరు అభివృద్ధి ఎమ్మెల్యే రోహిత్ రెడ్డితోనే సాధ్యమని వికారాబాద్ జెడ్పీటీసీ, ఎమ్మెల్యే తల్లి ప్రమోదిని అన్నారు. మండల పరిధి దేవనూరు, దుబ్బలతండా, దేవులతండాలో జెడ్పీటీసీ సంధ్యారాణితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. తండాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని, మరింత అభివృద్ధి జరగాలంటే మరోసారి బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శివకుమార్, ఏఎంసీ డైరెక్టర్ మంత్రి వెంకటయ్య, మాజీ డైరెక్టర్ ఆశన్న, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, మాజీ ఎంపీటీసీ వెంకటయ్యగౌడ్, నాయకులు కృష్ణ తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలు అందాలంటే..

దౌల్తాబాద్: పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా నరేందర్ రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి తనయుడు హితీష్‌రెడ్డి కోరారు. ఇంటి ప్రచారంలో భాగంగా ఆయన పలు గ్రామాల్లో పర్యటించి, అధికార బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఇందులో జెడ్పీటీసీ మహిపాల్, ఎంపీపీ విజయ్‌కుమార్ ఉన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి..

యాలాల: తాండూరు అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని బీఆర్‌ఎస్ తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అభ్యర్థించారు. యాలాల మండలం బండమీదిపల్లి గ్రామానికి చెందిన నరేష్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా.. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలంటే అది ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే సాధ్యమని, కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు.

మేనిఫెస్టో బాగుంది..

మర్పల్లి: బీఆర్‌ఎస్ మేనిఫెస్టో బాగుందని డీసీసీబీ మాజీ డైరెక్టర్ సింగం శెట్టి ప్రభాకర్‌గుప్తా అన్నారు. మర్పల్లి మండల కేంద్రంలో జెడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి టౌన్ ప్రెసిడెంట్ గఫార్, మార్కెట్ డైరెక్టర్ గౌస్‌తో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టోను చూసి ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌కు పట్టం కడతాయని, మరోసారి అధికారంలోకి రాగానే దివ్యాంగుల పింఛన్, ఆసరా పింఛన్‌ను సీఎం పెంచనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు రమేష్‌మిత్ర, ఉప సర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు కోసం మంతనాలు

కాసానితో కొప్పుల భేటీ

పరిగి: ఇటీవల తెలుగు దేశం పార్టీ వీడి బీఆర్‌ఎస్‌లో చేరిన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కాసానితో కొప్పుల మాట్లాడారు. మీ చేరికతో పార్టీకి నూతన ఉత్సహం వచ్చిందన్నారు. పరిగి నియోజకవర్గంలోని ముదిరాజ్ కులస్తుల, టీడీపీ కేడర్ బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇచ్చేలా చూడాలని కోరారు. వచ్చేది మన ప్రభుత్వమేనని.. ముదిరాజ్‌ల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తారన్నారు. ఈ భేటీలో కాసాని వీరేశ్, మధుసూదన్ ముదిరాజ్ తదితరులున్నారు.



కాసానితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

అధికారం ఖాయం..

మర్పల్లి: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో అధికారం ఖాయమని ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మహ్మద్ సలీం, మార్కెట్ వైస్ చైర్మన్ రామేశ్వర్, బీసీ సెల్ జిల్లా నాయకుడు నగేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వారు ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. చేతి గుర్తుకు ఓటు వేసి, మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాములు యాదవ్, నగేశ్, నియోజకవర్గ సీనియర్ నాయకుడు దివాకర్, మర్పల్లి మాజీ సర్పంచ్ పాండునాయక్, మాజీ ఎంపీటీసీ శేఖర్, మండల నాయకులు సర్వేశ్, మర్పల్లి యూత్ ప్రెసిడెంట్ రఘు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అక్రమ రవాణాను అరికట్టాలి



రాఘవపూర్ చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న మునిష్ రజనీ

పరిగి: చెక్ పోస్టుల వద్ద సోదాలు పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు మునిష్ రజనీ పోలీసులకు సూచించారు. ఆదివారం ఆయన మండల పరిధి రాఘవపూర్, నంచర్ల చెక్‌పోస్టులను పరిశీలించారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమంగా డబ్బు, మద్యం తరలిస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని చెప్పారు. అప్రమత్తంగా ఉండి, అక్రమ రవాణాను అరికట్టాలన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని దాతలు చెప్పారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సాయిరెడ్డిగూడ మల్లన్న స్వామి దేవాలయ నిర్మాణానికి దోనూరు శంకరయ్య రూ.2.51లక్షలు, అంజయ్య రూ. 30వేలు, జహంగీర్ రూ. 51వేలు, నర్సింహులు రూ.11వేలు, ముత్యల్‌రెడ్డి రూ.1,00,116, లింగం రూ.1.11లక్షలు, రాంరెడ్డి రూ.1.50లక్షలు, బోకుల లింగం రూ.1.51లక్షలు విరాళంగా అంజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా దాతలను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్న నర్సింహారెడ్డి, శేఖర్‌రెడ్డి, శంకరయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.